సాక్షి
మెదక్
ఆదివారం । 5 । నవంబర్ । 2023



అందరి చూపు వారి పైనే..

మల్లన్నసాగర్ నిర్వాసితులను మచ్చిక చేసుకునేందుకు ప్రధాన పార్టీలు యత్నం చేస్తున్నాయి. వివరాలు 10లో ▸



బీసీ బిడ్డను.. ఆశీర్వదించండి

బీసీ బిడ్డ అయిన తనను గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్ యాదవ్ అన్నారు. వివరాలు 10లో ▸



అభివృద్ధిని చూసి ఓటేయండి

కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని పార్టీ నాయకులు ప్రచారంలో ఓటర్లను కోరుతున్నారు. వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చంద్



మాట్లాడుతున్న రీటాలాల్‌చంద్

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్‌లో జరిగే ఘటనలను ఎదుర్కొనేందుకు దోహదపడుతాయని జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చంద్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాలు, షీ టీమ్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కరుణాకర్, సిద్ధిరాములు, ఎస్ఐ ఆనంద్‌గౌడ్, షీటీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లోనే బిల్లులు



సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

మెదక్ కలెక్టరేట్: పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, డీఏ, ఏరియర్స్, సరెండర్ లీవ్ తదితర బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు.ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అశోక్, దిలీప్ కుమార్, జిల్లా బాధ్యులు భూపతిగౌడ్, రాఘవరావు, శ్రీనివాస్, రేఖ, అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో కూడిన అల్పాహారం



విద్యార్థులతో అల్పాహారాన్ని తింటున్న కృష్ణారావు

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలని డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి కృష్ణారావు సూచించారు. నర్సాపూర్ పట్టణంలోని రోషిని ప్రాథమిక పాఠశాల, అవంచ పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించారు. అల్పాహారం అందించడంతో పిల్లలు రోజూ పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చా నాయక్, హెచ్ఎంలు ధన్‌సింగ్, అబ్దుల్, భైరవరెడ్డి పాల్గొన్నారు.

72 మంది క్రీడాకారులు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 72 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. చేగుంటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను నిర్వహించారు. జిల్లా నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో బాలబాలికలు 72 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రెటరీ రమేశ్ తెలిపారు. రామేశ్వర్‌రెడ్డి అమూల్యమ్మ, సమ్మయ్య, కోచ్ గణేశ్ రవికుమార్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఇన్‌చార్జి పీడీ శారద, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి వాహనం తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్: నర్సాపూర్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద హోంమంత్రి మహమూద్ అలీ వాహనాన్ని శనివారం పోలీసులు తనిఖీ చేశారు. నర్సాపూర్‌లో బీఆర్ఎస్ మైనార్టీ సమ్మేళనం ఏర్పాటు చేసింది. కార్యక్రమానికి హోంమంత్రి వెళ్తుండగా మార్గమధ్యలో కారు తనిఖీ చేసి పంపించారు.

జంప్ జిలానీలు

రంగులు మారుతున్న రాజకీయం



సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రాజకీయం రంగులు మారుతోంది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో ఉండేది. ప్రస్తుతం ఆ సీన్ మారిపోయింది. పార్టీల్లో టికెట్ రాని వారు ఇతర పార్టీల్లోకి మారి ఒకరిపై ఒకరు విమర్శలు చేస్తూ తమ విలువల్ని కాలరాస్తున్నారు. నిన్నటి వరకు అవినీతి పరుడుగా కనిపించిన నేత.. నేడు ఆదర్శుడిగా పొగుడుతున్న తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. పార్టీలు మారిన నాయకులకు ప్రజలు మద్దతు ఇస్తారా.. లేదా అనే సందేహం నెలకొంది.

– మెదక్

- పూటకో కండువా కప్పుకుంటున్న నాయకులు
- టికెట్ రాని వారు, ముఖ్య నాయకులకు పార్టీల వల
- ఆఫర్లు ప్రకటిస్తూ భవిష్యత్ హామీలు
- జనం మద్దతుపై సందేహాలు

రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగిన తర్వాత అన్ని రాజకీయ పార్టీల్లో టికెట్‌ల లొల్లి మొదలైన విషయం తెలిసిందే. ప్రధాన పార్టీలు తమ నియోజకవర్గాల్లో సర్వేల అనంతరం గెలిచే వారికే టికెట్‌లను ఖరారు చేశాయి. దీంతో టికెట్ దక్కని నాయకులంతా ఒక్క క్షణం ఆలోచించకుండా పార్టీలు మారారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో టికెట్ ఆశించి భంగపడ్డ వారు, ముఖ్య నాయకులు రాత్రికిరాత్రే పార్టీలు మారారు. ప్రధాన పార్టీలు అయిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల్లో జంపింగ్‌లు మొదలయ్యాయి. తాము అధికారంలోకి రాగానే నామినేటెడ్ పోస్టు లేదా? మండల, జిల్లా స్థాయి పదవి, టికెట్ ఇస్తామని భవిష్యత్ హామీలను ఇచ్చి పార్టీలోకి చేర్చుకుంటున్నారు. ప్రస్తుతం పార్టీలు మారిన నాయకులు ఇన్ని రోజులు తమ వెంట ఉన్న కార్యకర్తలు, ప్రజల నుంచి ఓట్లు ఏ మేరకు రాబడుతారో చూడాలి.

బీఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్యే..

కాంగ్రెస్‌లో ఏళ్ల తరబడి పని చేస్తూ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన వారిని బీఆర్ఎస్ నాయకులు క్యాచ్ చేసి పార్టీలో చేర్పించుకుంటున్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి సుమారు రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఉన్నారు. 2018లో కాంగ్రెస్ టికెట్ ఆశించగా ఆయనకు ఇవ్వకుండా పార్టీ అధిష్టానం ఆయన తమ్ముడు ఉపేందర్‌రెడ్డికి ఇచ్చింది. దీంతో పార్టీ తీరును విబేధించి బీజేపీలో చేరారు. అనంతరం ఎన్నికలు సమీపిస్తుండడంతో తిరిగి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈసారి టికెట్ కోసం శశిధర్‌రెడ్డితోపాటు మెదక్ డీసీసీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, పీసీసీ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, వీరికి టికెట్ రాకపోవడంతో బీఆర్ఎస్‌లో చేరారు.

భూమలింగంగౌడ్ ఏ పార్టీ వైపు?



కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుంటున్న లింగంగౌడ్

చేగుంట మండల కేంద్రానికి చెందిన భూమలింగంగౌడ్ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగారు. ఆ పార్టీలో బీసీలకు ప్రాధాన్యత లేదని విబేధించి సెప్టెంబర్ 13న రాజీనామా చేసి త్వరలో బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కానీ, అక్టోబర్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల సమక్ష్యంలో తిరిగి బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. మళ్లీ ఇటీవల బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ వెంట ఎన్నికల ప్రచారంలో భాగంగా హెలిక్యాప్టర్‌లో వెళ్లారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఆయన ఏ పార్టీలో ఉన్నారంటూ పలువురు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్‌లోకి ముఖ్యనేతలు..



మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో వెల్దుర్తి ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో తనకు ప్రాధాన్యత దక్కడం లేదని ఇటీవల మైనంపల్లి హన్మంతరావు సమక్ష్యంలో కాంగ్రెస్‌లోకి చేరారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలిపిచెడ్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిలుముల శేష సాయిరెడ్డితోపాటు ఆయన తల్లి బీఆర్ఎస్ నాయకురాలు సుహాసినిరెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా నాయకులు, కార్యకర్తలు పూటకో పార్టీ మారుతుండడంతో ఎవరికి మద్దతు ఇవ్వాలో ప్రజలకు కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది.

రెండో రోజు ఒక్కటే..

- మెదక్‌లో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్



ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా రెండో రోజు శనివారం ఒకే ఒక్క నామినేషన్ దాఖలు అయ్యింది. ఆర్డీవో కార్యాలయంలో మెదక్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా గడ్డమీది నాగరాజుగౌడ్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్‌కు అందించారు. - మెదక్

జాగ్రత్తగా సరి చూడాలి

నామినేషన్ పత్రాలపై అధికారులకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నర్సాపూర్: అభ్యర్థులు అందజేసే నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా సరి చూడాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా సూచించారు. శనివారం ఆయన నర్సాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి రిటర్నింగ్ అధికారితో పాటు ఇతర అధికారులకు సూచనలు చేశారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల వివరాలు నమోదు చేసే రికార్డులను, కార్యాలయంలో వసతులను పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు వసతులు, రికార్డులు వివరించారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ వైపీఆర్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా ఎస్పీ రోహిణీప్రియదర్శినిని ఆదేశించారు. శనివారం కళాశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలకు చెందిన కౌంటింగ్ కేంద్రాలు ఇక్కడే ఏర్పాటు చేయనున్నందున అధికారులు అందుకు అవసరమైన మీడియా పాయింట్, బారికేడ్లు, విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లలో అధికారులు ఎలాంటి కొరత లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో అంబదాస్, రాజేశ్వర్, మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ అధికారులు సర్దార్‌సింగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం

హోంమంత్రి మహమూద్ అలీ



మాట్లాడుతున్న మహమూద్ అలీ, పక్కన అభ్యర్థి సునీతా రెడ్డి

నర్సాపూర్: రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. శనివారం నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హోంమంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని ముస్లింలను అన్ని పార్టీలు ఓటు బ్యాంకుగానే పరిగణించాయని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డికి అండగా మైనార్టీలు ఉండాలని కోరారు. సునీతారెడ్డి నర్సాపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తుందని, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎంపీగా గెలుస్తారని హోంమంత్రి జోస్యం చెప్పారు. అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే ముస్లింల కోసం మండలానికో షాదీఖానా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి బాసిత్, ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నర్సాపూర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, నర్సాపూర్ ముత్తవల్లి మసియొద్దీన్, పార్టీ నాయకులు హబీబ్‌కాన్, లాయక్, షేక్ హుస్సేన్, మహ్మద్, చంద్రాగౌడ్, వెంకట్‌రెడ్డి, సత్యం, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ

హవేళిఘణాపూర్(మెదక్): ఓటు హక్కును వినియోగించుకునేలా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని స్వీప్ జిల్లా అధికారి రాజిరెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి గీతా హైస్కూల్‌లో విద్యార్థులు ఓటు ఫర్ షూర్ అనే ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకులా కృషి చేయా లని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుగుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి నాలుగు ప్రాజెక్ట్‌లు

డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. శనివారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 55 ప్రాజెక్టులు ప్రదర్శనకు రాగా ఉత్తమమైన నాలుగు ప్రాజెక్టలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. రక్షక్(10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్ పొడ్చన్‌పల్లి), వాగ్దేవి (10వ తరగతి, గీతాహైస్కూల్, మెదక్), అబ్దుల్ హమీద్(10వ తరగతి, సిద్ధార్థ్ రూరల్ హైస్కూల్, మాచవరం), శివసాయి గణేశ్ (8వ తరగతి, గీతాహైస్కూల్, తూప్రాన్) రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అలాగే శ్రీహర్షిత (10వ తరగతి, జీజీహెచ్ఎస్, మెదక్), నితన్యశ్రీ (10వ తరగతి, టీఎస్ఆర్ఎస్(జీ),మెదక్ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కో ఆర్డినేటర్ ప్రభు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ, ఉపన్యాసకులు సుమన, మధుసూదన్‌రావు, గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తండాలు గ్రామపంచాయతీలుగా..

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



మహిళలను పలకరిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): సీఎం కేసీఆర్ కృషితో తండాలు మొత్తం గ్రామ పంచాయతీలుగా మారాయని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. రామయంపేట మున్సిపాలిటీ పరిధిలోని రామాయంపేట తండా, గుల్పర్తి, కోమటిపల్లిలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమెకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. తండాలోని సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ సంప్రదాయ వస్త్రాల్లో గిరిజనులు, ఎమ్మెల్యేతో నృత్య ప్రదర్శన చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలు బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తండావాసులు పాల్గొన్నారు.

ప్రజలే కేసీఆర్‌కు బుద్ధి చెబుతారు

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్



ఈటలకు హారతులు పడుతున్న మహిళలు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో కేసీఆర్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని, రెండు సార్లు గెలిపించినందుకు ప్రజలకు ఏం చేశారని ఈటల రాజేందర్ విమర్శించారు. శనివారం మనోహరాబాద్ మండలంలో ప్రచారం నిర్వహించారు. కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నత్తి మల్లేశ్, బీజేపీ అధ్యక్షుడు కమ్మరి నరేందర్ చారిల ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఆయన్ను సన్మానించారు. అనంతరం కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లి, గొల్లగడ్డ, మనోహరాబాద్ గ్రామాల్లో ర్యాలీ తీసి జీడిపల్లిలో పార్టీ కార్యాలయంను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

కొండంత అభిమానం

కోనాయిపల్లిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పూలవర్షం



కేసీఆర్‌పై గులాబీ పూలు చల్లుతున్న అభిమానులు

- నామినేషన్ పత్రాలతో కోనాయిపల్లి ఆలయానికి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్
- ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు
- మూడోసారి సీఎం అంటూ నినాదాలు

నంగునూరు(సిద్దిపేట): బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నంగునూరు మండలం కోనాయిపల్లిలో ఘనస్వాగతం లభించింది. శనివారం నామినేషన్ పత్రాలతో కోనాయిపల్లి లోని తన సెంటిమెంట్ ఆలయానికి వచ్చారు. దీంతో గ్రామస్తులు గులాబీ పూల వర్షం కురిపించారు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా, ఆలయ కమిటీ ముఖ్యమంత్రిని సన్మానించింది. మహిళలు మంగళహారతులు పట్టి.. తిలకం దిద్దుతూ కేసీఆర్ జిందాబాద్, మూడో సారి మీరే సీఎం అంటూ నినదించారు. ఐదేళ్ల తర్వాత గ్రామానికి వచ్చిన కేసీఆర్ మండల నాయకులకు అభివాదం చేస్తూ వారితో ఫొటోలు దిగారు. అనంతరం బీఆర్ఎస్ బంగారు తెలంగాణ ఆడియో పాటల సీడీని మంత్రి హరీశ్‌రావుతో కలసి రిలీజ్ చేశారు. గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడేందుకు బీఆర్ఎస్ నాయకులు రథాన్ని ఏర్పాటు చేసినా.. ఆలయం ప్రాంగణం కావడంతో అభివాదం చేస్తూ వెళ్లిపోయారు.

కొందరికే అనుమతి

భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు ఆలయంలోకి కొందరు నాయకులనే అనుమతించారు. దీంతో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు అభిమానులు నిరుత్సాహానికి గురయ్యారు. సీఎం వెంట హరీశ్‌రావు తోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జెడ్పీటీసీ ఉమ, సర్పంచ్ వెంకటేశం, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి పూజలో పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు, సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మిర్చీ తీసుకో.. ఓటు వేసుకో..



గజ్వేల్‌లో మిర్చి వేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

కాంగ్రెస్‌ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్‌ : అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్‌ను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్‌ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుల పగుళ్లతో కేసీఆర్‌ కుటుంబం అవినీతి బయటపడిందని విమర్శించారు.అభివృద్ధి పేరిట వేలాది ఎకరాల భూములను లాక్కొని అనేక కుటుంబాలను రోడ్డున పడేశారని ఆరోపించారు. ప్రచారంలో భాగంగా ఓ బండి వద్ద నర్సారెడ్డి బజ్జీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర నాయకుడు సర్దార్‌ఖాన్‌, మల్లారెడ్డి, గోపాల్‌రావు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామక్క పాట.. ప్రతాప్‌ ఆట



మహిళలతో నృత్యం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

మర్కూక్‌(గజ్వేల్‌): సీఎం కేసీఆర్‌పై రామక్క పాడిన పాట నాయకులు, మహిళల్లో జోష్‌ నింపింది. మర్కూక్‌లో ఆ పాటకు ప్రతాప్‌రెడ్డి మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఆయనతోపాటు కార్యకర్తలు కూడా చిందేశారు.

పూరీలు తినెయ్‌.. కారుకు ఓటెయ్‌..



ముస్త్యాలలో పూరీలు కాలుస్తున్న ఏకానందం

చేర్యాల(సిద్దిపేట): మండలంలో బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రచారం జోరందుకుంది. శనివారం ముస్త్యాల గ్రామంలో ఆ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఉల్లెంగుల సేవా ట్రస్ట్‌ చైర్మన్‌ ఉల్లెంగుల ఏకానందం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఓ హోటల్‌లో పూరీలను కాలుస్తూ.. కారు గుర్తుకే ఓటు వేసి పల్లాను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌ చైర్మన్‌ సుంకరి మల్లేశం, సర్పంచ్‌ పెడతల ఎల్లారెడ్డి, మార్కెట్‌ డైరెక్టర్‌ తాటికొండ సదానందం, మల్లన్న ఆలయ డైరెక్టర్‌ కొంగరి గిరిధర్‌, దాసు, లక్ష్మణ్‌, ప్రశాంత్‌, రాము, మహేందర్‌, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు

సిద్దిపేటజోన్‌: ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గ పరిధికి సంబంధించి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేశారు. శనివారం రిటర్నింగ్‌ అధికారి, అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ అధికారులు రమేష్‌ బాబు, దిలీప్‌ నాయక్‌ దీనిని పరిశీలించారు. ఫిర్యాదులు, ఓటరు జాబితా సందేహాలు, సమాచారం కోసం 08457–359950 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న త్రిష దామోదర

వట్‌పల్లి(అందోల్‌): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్‌ యువ నాయకురాలు త్రిష దామోదర అన్నారు. శనివారం ఆమె నాదులాపూర్‌, మాసాన్‌పల్లి, కొడెకల్‌ గ్రామాల్లో ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటువేసి తన తండ్రి, ఆ పార్టీ అభ్యర్థి దామోదర రాజనర్సింహను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్‌, మాజీ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పద్మనాభరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, రమేశ్‌ గౌడ్‌, క్రిష్ణ, నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరిచూపు వారిపైనే..

- మల్లన్నసాగర్‌ నిర్వాసితులను మచ్చిక చేసుకునేందుకు ప్రధాన పార్టీల యత్నం
- జోరుగా సంప్రదింపులు, సమావేశాలు





గజ్వేల్‌లోని మల్లన్నసాగర్‌ నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీ

గజ్వేల్‌: గజ్వేల్‌ అసెంబ్లీ ఎన్నికల్లో మల్లన్నసాగర్‌ నిర్వాసితుల వ్యవహారం ఆసక్తికరంగా మారింది. వీరిని తమవైపు తిప్పుకునేందుకు ప్రధాన పార్టీలు ఆరాటపడుతున్నాయి. గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్‌ గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీని నిర్మించిన సంగతి తెలిసిందే. మల్లన్నసాగర్‌ రిజర్వాయర్‌ నిర్మాణం వల్ల తొగుట మండలంలో పల్లెపహాడ్‌, వేములగాట్‌, ఏటిగడ్డ కిష్టాపూర్‌, లక్ష్మాపూర్‌, రాంపూర్‌, బ్రాహ్మణ బంజేరుపల్లి, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైన సంగతి తెలిసిందే. కాగా ఏటిగడ్డకిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములగాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రహ్మణ బంజేరుపల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో మరో 330కుపైగా కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ లెక్కన ఆయా గ్రామాలకు చెందిన సుమారు 10వేలకుపైగా ఓట్లు గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీకి బదిలీ అయ్యాయి. కాగా ఆయా గ్రామాల్లో భూమితో ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడంతోపాటు ప్రతి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ కింద రూ.7.5లక్షలు, ఇల్లు.. ఇల్లు వద్దంటే వారికి ఓపెన్‌ ప్లాటు, మరో రూ.5లక్షలు పంపిణీ చేశారు. అంతేకాకుండా కుటుంబంలో 18ఏళ్ల పైబడిన వారుంటే ఇల్లు లేదంటే ఓపెన్‌ప్లాటు, రూ.5లక్షలు ఇచ్చారు. ఇంకా ఎన్నో సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. 95శాతం మేరకు సమస్యలను పరిష్కరించిన తాము మిగిలినవి కూడా నెరవేర్చుతామని అధికార బీఆర్‌ఎస్‌ పార్టీ హామీ ఇస్తుంది. అంతేకాకుండా నిర్వాసితులతో నాయకులు నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు. ఇదే క్రమంలో ఐదు రోజుల క్రితం వర్గల్‌ మండలం గౌరారం గ్రామంలో మల్లన్నసాగర్‌ నిర్వాసితులతో మంత్రి హరీశ్‌రావు, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్‌ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిర్వాసితుల త్యాగం గొప్పదని, వారికి ఎన్ని సేవలు చేసినా తక్కువేనని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న 5–10శాతం సమస్యలను సైతం పరిష్కరిస్తామని, ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. గతనెల 20న మేడ్చల్‌ జిల్లా అంతాయిపల్లిలో నిర్వహించిన ఆ పార్టీ గజ్వేల్‌ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నిర్వాసితుల అంశాన్ని సీఎం కేసీఆర్‌ ప్రత్యేకంగా ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ న్యాయ సమ్మతమేనని, ఎన్నికలు ముగిసిన వెంటనే ఒక రోజు ఇరిగేషన్‌ ముఖ్య కార్యదర్శిని, కలెక్టర్‌ను గజ్వేల్‌కు పిలిపించి వందశాత సమస్యల పరిష్కారానికి ఆదేశాలిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ, కాంగ్రెస్‌ నేతలు సైతం నిర్వాసితులను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల్లో తమకు మద్దతు ప్రకటిస్తే మీ తరఫున పోరాడుతామని హామీ ఇస్తున్నారు. ప్రధాన పార్టీల ప్రచారాల నేపథ్యంలో నిర్వాసితులు ఎటువైపు నిలుస్తారనేది తేలాల్సి ఉంది.

పనిచేసే ప్రభుత్వానికి పట్టం కట్టండి

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌ ప్రభాకర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

కొండపాక: పనిచేసే ప్రభుత్వానికి పట్టం కట్టాలని, సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దేవి రవీందర్‌ పిలుపునిచ్చారు. శనివారం చిన్నకిష్టాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్‌ పథకాలు, మేనిఫెస్టో గురించి వివరించారు. ప్రధాన కూడలిలో మహిళలు, నాయకులు కలిసి రామక్క పాటపై నృత్యం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల సారధి కేసీఆర్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కనకయ్య, ఎంపీటీసీ భగవాన్‌, గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రం, యూత్‌ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ సద్గుణ, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ అమరేందర్‌, కొండపోచమ్మ డైరెక్టర్‌ లక్ష్మణ్‌రాజ్‌, ఉపసర్పంచ్‌ రాజిరెడ్డి పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు

కాంగ్రెస్‌ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌



బంజర్‌పల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న పొన్నం ప్రభాకర్‌

హుస్నాబాద్‌: పేదల కలలు సాకారం కావాలంటే కాంగ్రెస్‌ అధికారంలోకి రావాలని ఆ పార్టీ హుస్నాబాద్‌ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌ కోరారు. శనివారం పట్టణంలో విజయభేరి యాత్ర నిర్వహించారు. అంతకు ముందు బంజర్‌పల్లి, పందిల్ల, పొట్లపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తం పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తుందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2500, గ్యాస్‌ సిలిండర్‌ రూ.500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు తెలిపారు. పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల సాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ అసమర్థతతోనే నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్‌ విండో చైర్మన్‌ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్‌, పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు వల్లపు రాజు, చిత్తారి పద్మ, సరోజన పాల్గొన్నారు.

దోచుకోవడం బీఆర్‌ఎస్‌ ఎజెండా

కాంగ్రెస్‌ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు



మాట్లాడుతున్న రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్‌): దోచుకోవడం..దాచుకోవడమే బీఆర్‌ఎస్‌ నాయకుల నైజమని మెదక్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌ రావు అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కొత్తపల్లి, పాపన్నపేట, నార్సింగి, బాచారం, చిత్రియాల్‌, తమ్మాయపల్లి, అమ్రియా తండా, దౌలపూర్‌, పొడిచన్‌పల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దత్తత తీసుకున్న పాపన్నపేట గ్రామ రోడ్డు చూస్తే చాలు.. ఆమె చేసిన అభివృద్ధి ఏపాటిదో తెలుస్తుందన్నారు. మిషన్‌ కాకతీయ పేరిట చెరువుల్లో గోతులు తవ్వి రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. పండగ వస్తే తండాల్లో తాగునీటి కోసం తండ్లాట ఉందన్నారు. రుణమాఫీ ఎంతమంది రైతులకు చేశారో చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్‌ మాటల గారడీని నమ్మొద్దని తెలిపారు. పాపన్నపేట కో ఆప్షన్‌ సభ్యులు గౌస్‌, ఏఎంసీ డైరెక్టర్‌ కిషన్‌రెడ్డి, పద్మశాలి సంఘం కార్యదర్శి తూర్పు నగేష్‌, ఉమామహేశ్వర్‌, మన్సూర్‌ తోపాటు వందలాది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏసీఎస్‌ చైర్మన్‌ త్యార్ల రమేష్‌, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, గోవింద్‌ నాయక్‌, శ్రీకాంతప్ప, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌, రమేష్‌ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చేది కాంగ్రెస్సే


ఆవుల రాజిరెడ్డి



ఎన్నికల ప్రచారంలో ఆవుల రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్‌): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చడంలో కాంగ్రెస్‌ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, బీఆర్‌ఎస్‌ పార్టీలా మాట తప్పదని ఆ పార్టీ నర్సాపూర్‌ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాంపూర్‌లో పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం కిష్టాపూర్‌, పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్‌, వసురాం తండా, అంసాన్‌ పల్లి, పోతిరెడ్డిపల్లి, జలాల్‌పూర్‌, కొంగోడ్‌, అప్పాజిపల్లి, మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. రాజిరెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో రాష్ట్రప్రభుత్వం నర్సాపూర్‌ నియోజకవర్గంలో ఏ ఒక్క నిరుపేదకు ఇల్లు కట్టిచ్చిన పాపాన పోలేదన్నారు. అధికారంలోకి రాగానే ఆరు హామీలు నెరవేర్చుతామని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశం గౌడ్‌, మహేశ్వర్‌ రెడ్డి, సుహాసిని రెడ్డి, గోవర్ధన్‌, జనార్దన్‌ రెడ్డి, అంజాగౌడ్‌, గొండ కృష్ణ, ఆగంగౌడ్‌, ప్రభాకర్‌, రమేష్‌, వెంకట్‌ గౌడ్‌, ఉపేందర్‌, అల్లి చందు, అనిల్‌, మహేందర్‌ రెడ్డి, వెంకటేశం, ప్రవీణ్‌ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ గడపకు ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్‌): బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని జహీరాబాద్‌ ఎంపీ బీబీపాటిల్‌ అన్నారు. శనివారం ఆయన బీఆర్‌ఎస్‌ అభ్యర్థి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో మండలంలోని దుదగొండ, తుమ్నూర్‌, బోరంచ, రాణాపూర్‌, ముగ్దుంపూర్‌, మాయికోడ్‌, మనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖేడ్‌ను అభివృద్ధి పరిచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు చేర్చామన్నారు. తనకు మరోమారు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ, విఠల్‌రావు, సత్యపాల్‌రెడ్డి, పరమేశ్వర్‌, సత్యపాల్‌రెడ్డి, పండరి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీ బిడ్డను.. ఆశీర్వదించండి

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్‌ యాదవ్‌



మాట్లాడుతున్న మురళీధర్‌ యాదవ్‌

కౌడిపల్లి(నర్సాపూర్‌): బీసీ బిడ్డను అయిన తనను ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీధర్‌ యాదవ్‌ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తునికి, వెంకట్రావ్‌పేట్‌, ముట్రాజ్‌పల్లి తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిగా చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 15 ఏళ్లు సునీతారెడ్డి, 10ఏళ్లు మదన్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా చేసినప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. 10 బస్సులతో పేరుకే నర్సాపూర్‌ డిపోను ప్రారంభించారని.. ఏ గ్రామానికి అవి సక్రమంగా వెళ్లడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో శ్మశాన వాటికలు, రైతు వేదికలు నిర్మించి, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేగా తనని గెలిపిస్తే నియోజకవర్గాన్ని చార్మినార్‌జోన్‌లో కలపడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోడ రాజేందర్‌, శ్రీరామ్‌రెడ్డి, రాకేష్‌, చెల్ల కుమార్‌, అశోక్‌ పాల్గొన్నారు.

జంగ్‌ తెలంగాణ

మాటతప్పిన కేసీఆర్‌ను ఓడించాలి

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌



గౌరారంలో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్‌

వర్గల్‌(గజ్వేల్‌): దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు ఇస్తానని మాటతప్పిన కేసీఆర్‌ను ఓడించి.. తనను ఆశీర్వదించి గెలిపించాలని గజ్వేల్‌ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ కోరారు. శుక్రవారం రాత్రి మండల పరిధిలోని గౌరారంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతిపట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలవేసి, ఎల్లమ్మ, పెద్దమ్మ, పోచమ్మ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో మమేకమవడంతోనే హుజూరాబాద్‌ నియోజకవర్గ ప్రజలు తనను కడుపులో పెట్టుకుని చూసుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పూదరి నందన్‌గౌడ్‌, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం మహిపాల్‌, మధుసూదన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్‌, నిఖిల్‌ పాల్గొన్నారు.



ఓటేయాలని మాట తీసుకుంటున్న రాకేష్‌రెడ్డి

ఒట్టేసి చెప్పన్నా.. ఓటేస్తానని..

చేర్యాల మండల పరిధిలో కాంగ్రెస్‌ ప్రచారం జోరందుకుంది. శనివారం ఆ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి ఆకునూరు, కొత్త దొమ్మాట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కలుస్తూ ఆరు గ్యారంటీల గురించి వివరించారు. తన తండ్రికి తప్పక ఓటేయాలని మాట తీసుకున్నారు.

–చేర్యాల(సిద్దిపేట)

రాష్ట్రంలో కాంగ్రెస్‌దే అధికారం



లద్నూరులో కుట్టు మిషన్‌ను కుడుతున్న కొమ్మూరి అరుణ

మద్దూరు(హుస్నాబాద్‌): రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సతీమణి అరుణ అన్నారు. శనివారం మండలంలోని లద్నూరు గ్రామంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్‌ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. రైతులకు కోసం అనేక ప్రాజెక్టులు రూపొందించిందన్నారు. బీఆర్‌ఎస్‌ నేతల మాయ మాటలు నమ్మొద్దని చెప్పారు. స్థానికుడైన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ఓటు వేసి ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ కామిడి జీవన్‌రెడ్డి, దాసరి పద్మారెడ్డి, రామడుగు బాలరాజు, శ్రీధర్‌రెడ్డి, జీడికంటి సురేష్‌, బోగి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పూజలు చేసి.. ప్రచారం ప్రారంభించి..



ప్రచార రథానికి పూజలు నిర్వహిస్తున్న మల్లేశం యాదవ్‌

దుబ్బాక: ప్రచార వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దుబ్బాక బహుజన సమాజ్‌ పార్టీ అభ్యర్థి సల్కం మల్లేశం యాదవ్‌ శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని రేకులకుంట మల్లన్న దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన స్వగ్రామమైన పోతారంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్‌ఎస్‌ పాలనతో ప్రజలు విసుగుచెందారని ఆరోపించారు. ఏనుగు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు.